TELTEL12349

# మన సాక్షి
గొంతుక

తెలుగు దినపత్రిక

ఎడిటర్: గుండ రాజు

చీఫ్ ఎడిటర్: చింతల మధుకృష్ణ

విలేకరులకు ఇదే మా ఆహ్వానం

అనతి కాలంలోనే విశేష ఆదరణ పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న మన సాక్షి గొంతుక తెలుగు దినపత్రిక అతి త్వరలో తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు చేరుయ్యేందుకు సుముహూర్తం సిద్ధమయ్యింది. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అనుభవం, ఆసక్తి కలిగిన విలేకరులకు ఇదే మా ఆహ్వానం.

చీఫ్ ఎడిటర్ : చింతల మధుకృష్ణ

7095686969

ఎడిటర్ : గుండ రాజు

96763 33440



RNI: TELTEL12349

మన సాక్షి

గొంతుక

తెలుగు దినపత్రిక ఎడిటర్: గుండ రాజు

చీఫ్ ఎడిటర్: చింతల మధుకృష్ణ

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 1 సంచిక : 84 14- 6 - 2024 శుక్రవారం పేజీలు : 6 వెల.4/-

# ట్యాపింగ్.. ఎంక్వైరీ!


## కేసులో టెంప్టింగ్ అంశాలు

- ఎన్నికల సమయంలో దొరికిన సొమ్మెంత?
- పట్టుకున్న దాంట్లో దోచుకున్నదెంత
- ఫోన్ ట్యాపింగ్ కేసులో కొత్త కోణం
- కేవలం డబ్బు పంపిణీపైనే దృష్టి
- ఇప్పటికే అంగీకరించిన నిందితులు
- వాస్తవాలు రాబట్టేందుకు చర్యలు
- మరోసారి విచారణ చేపట్టేందుకు సన్నాహాలు
- నిందితులకు బెయిల్ నిరాకరించిన కోర్టు
- డబ్బుతో పట్టుబడ్డ వారిని పిలిచేందుకు సన్నద్ధం
- లెక్కలపై ఆరా తీయనున్న అధికారులు

**ఎన్నికల సమయంలో ఫోన్ ట్యాపింగ్ ద్వారా పెద్దఎత్తున డబ్బు స్వాధీనం చేసుకున్నట్టు ఆధారాలు బయటపడుతున్నాయి. దీనిలో ఐపీఎస్ ఆఫీసర్ రాధాకిషన్‌రావు.. అతని గ్యాంగ్ కలిసి కొంత కాజేసి ఉంటారని అధికారులు అనుమానిస్తున్నారు. దీన్ని నిర్ధారించుకునేందుకు దర్యాప్తు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఎన్నికల సమయంలో డబ్బు రవాణాకు సంబంధించి నమోదైన కేసుల చిట్టా ప్రస్తుతం బయటకు తీస్తున్నట్లు తెలుస్తోంది. ఈ అక్రమాలు రుజువైతే నిందితులపై కొత్త కేసులు కూడా నమోదయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇక.. ఎన్నికల సమయంలో డబ్బు పంపిణీపైనే తాము ఎక్కువగా దృష్టి సారించామని ఫోన్ ట్యాపింగ్ నిందితులంతా ఇప్పటికే అంగీకరించారు.**

### కచ్చితమైన సమాచారంతోనే..

ఫోన్ ట్యాపింగ్ కోసం ఇంటెలిజెన్స్ డీఎస్పీ ప్రణీత్ రావు ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న వ్యవస్థ ద్వారా ప్రతిపక్షాలకు చెందిన వారిపై నిఘాపెట్టేవారు. డబ్బు రవాణా చేయబోతున్నారన్న సమాచారం తెలిసిన వెంటనేహైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ డీసీపీగా ఉన్న రాధా కిషన్‌రావుకు ఆ విషయాన్ని చేరవేసేవారు. దీని ఆధారంగా ఆయన సోదాలు నిర్వహించేవారు. ఇదంతా చాలా పకడ్బందీగా జరిగేది. ఒక్కోసారి స్థానిక పోలీసులకు కూడా సమాచారం అందేది. ఏ వెహికల్‌లో డబ్బు తరలిస్తున్నారు, ఆ వాహనం ఎక్కడి నుంచి వస్తుంది? ఎక్కడ ఉందనే కచ్చితమైన సమాచారాన్ని ప్రణీత్ బృందం సేకరించి పోలీసులకు చేరవేసేవారు.



దీని ఆధారంగానే అక్రమ సొమ్ము స్వాధీనం చేసుకునే వారని విచారణ అధికారులు చెబుతున్నారు.

### వాస్తవాల కోసం మరోసారి ఎంక్వైరీ..

తాము ఎక్కడెక్కడ ఎవరి డబ్బు పట్టుకున్నామో కూడా నిందితులు విచారణలో వెల్లడించారు. ఇవన్నీ వారి వాంగ్మూలంలో నమోదు అయ్యాయి. కొన్ని సందర్భాల్లో పట్టుబడిన డబ్బులో కొంత కాజేసి, మిగతాదే లెక్కల్లో చూపించారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఎన్నికల సమయంలో అక్రమంగా రవాణా చేస్తున్న డబ్బు కావడంతో దాన్ని తీసుకెళుతున్న వారు కూడా నిజం చెప్పేవారు కాదని, పోలీసుల రికార్డులో ఎంత రాస్తే అంతే సొమ్ము పట్టుబడ్డట్లు సంతకాలు కూడా పెట్టేవారని తెలుస్తోంది. దీనిపైనే ప్రస్తుతం అధికారులు దృష్టి సారించారు. ఎన్నికల సమయంలో డబ్బు రవాణా చేస్తూ పట్టుబడ్డ వారిని పిలిపించి, విచారించాలని భావిస్తున్నట్లు సమాచారం.

### నిందితులకు బెయిల్ నిరాకరణ

మరోవైపు తెలంగాణతో పాటు యావత్ దేశమంతా సంచలన సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులైన భుజంగరావు, తిరుపతన్నకు నాంపల్లి కోర్టు బెయిల్ నిరాకరించింది. బెయిల్ ఇస్తే సాక్షులను ప్రభావితం చేస్తారని పోలీసులు అభ్యంతరం తెలపడంతో కోర్టు వారి పిటిషన్లను కొట్టివేసింది. తమకు బెయిల్ మంజూరు చేయాలంటూ మే 28న అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న పిటిషన్లు దాఖలు చేశారు. రాజకీయ దురుద్దేశంతోనే భుజంగరావు, తిరుపతన్నను అరెస్టు చేశారని, కేసులో సాక్ష్యాధారాలు సమర్పించలేదని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కోర్టుకు వివరించారు. చార్జ్‌షీట్ దాఖలు చేసినా నిందితులను ఇంకా విచారించాలని, దీంతో వారికి బెయిల్ ఇవ్వొద్దని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోరారు. వాదనలు విన్న కోర్టు బెయిల్ పిటిషన్లను కొట్టివేసింది.

# నీట్ పరీక్ష గ్రేస్ మార్కులు రద్దు

- 1563 విద్యార్థులపై కమిటీ విచారణ
- తిరిగి పరీక్ష నిర్వహించేందుకు అనుమతి
- జూన్ 23న నీట్ ఎగ్జామ్
- ప్రస్తుత కౌన్సెలింగ్ షెడ్యూల్ యథాతథం
- వెల్లడి చేసిన సుప్రీంకోర్టు



ఎంబీబీఎస్, బీడీఎస్.. ఇతర వైద్య కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించిన జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్) యూజీ 2024లో అక్రమాలు చోటు చేసుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తిన వేళ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. నీట్ ఫలితాల్లో 1563 మందికి పైగా అభ్యర్థులకు ఇచ్చిన గ్రేస్ మార్కులను తొలగిస్తామని సుప్రీం కోర్టుకు తెలియజేసింది. వారికి మళ్లీ పరీక్ష రాసే అవకాశం కల్పిస్తామని చెప్పింది.

### నీట్ పరీక్షలో అక్రమాలపై ఆరోపణలు..

ఈ ఏడాది జరిగిన నీట్ పరీక్షలో 1563 మంది విద్యార్థులకు అదనంగా గ్రేస్ మార్కులు ఇచ్చారు. ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాల్లో మార్పులు, పరీక్ష కేంద్రాల వద్ద సమయం కోల్పోవడంతో వీటిని కలిపారు. అయితే దీనిపై అభ్యంతరాలు వ్యక్తమవడంతో పాటు నీట్ పరీక్షలో అక్రమాలపై ఆరోపణలు రావడంతో గతవారం కేంద్ర విద్యాశాఖ నలుగురు సభ్యులతో కమిటీ వేసింది. కోల్పోయిన సమయానికి పరిహారంగా గ్రేస్ మార్కులు పొందిన 1563 విద్యార్థులపై ఈ కమిటీ విచారణ జరిపి నివేదిక సమర్పించింది.

### ఆ తర్వాతే కౌన్సెలింగ్..

కమిటీ నిర్ణయాలను కేంద్రం గురువారం సుప్రీం కోర్టుకు తెలియజేసింది. కోల్పోయిన సమయానికి పరిహారంగా గ్రేస్ మార్కులు పొందిన ఆ 1563 మంది విద్యార్థుల స్కోర్ కార్డులను రద్దు చేయాలని కమిటీ నిర్ణయించింది. వారికి మళ్లీ పరీక్ష రాసేందుకు అవకాశం కల్పిస్తాం. జూన్ 23న పరీక్ష నిర్వహించి ఈ నెల 30వ తేదీలోగా వారి ఫలితాలను ప్రకటిస్తాం'' అని ధర్మాసనానికి కేంద్రం వెల్లడించింది. ఆ తర్వాతే కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపింది. ఒకవేళ మళ్లీ పరీక్ష రాయొద్దని అనుకునే వారు.. గ్రేస్ మార్కులు లేకుండా ఒరిజినల్ మార్కులతో కౌన్సెలింగ్‌కు వెళ్లొచ్చని పేర్కొంది.

### కౌన్సెలింగ్‌పై స్టేకు నిరాకరణ..

ఇక, నీట్ ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణలకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు గురువారం విచారణ జరిపింది. వెబ్ కౌన్సెలింగ్ పై స్టే ఇచ్చేందుకు న్యాయస్థానం నిరాకరించింది. కౌన్సెలింగ్ యథాతథంగా ఉంటుందని చెప్పిన ధర్మాసనం.. ఈ పిటిషన్లపై రెండు వారాల్లోగానే సమాధానం చెప్పాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి నోటీసులు జారీ చేసింది. అనంతరం దీనిపై తదుపరి విచారణను జులై 8వ తేదీకి వాయిదా వేసింది. జులై 6వ తేదీ నుంచి నీట్ కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది.

# గర్భిణులు, బాలింతలకు బెయిల్ ఇవ్వాల్సిందే

- తేల్చి చెప్పిన హర్యానా హైకోర్టు
- జైలులో ఉంటే పసిపిల్లలపై ప్రభావం ఉంటుంది
- తల్లి తప్పుకు బిడ్డలకు శిక్ష సరికాదు

జైలులో ఉన్న గర్భిణులు, పాలిచ్చే బాలింతలకు ప్రసవం నుంచి ఏడాది వరకూ మధ్యంతర బెయిల్ ఇవ్వొచ్చని పంజాబ్, హర్యానా హైకోర్టు అభిప్రాయపడింది. ఒక కేసులో జైలుకెళ్లిన ఓ గర్భిణీ ఖైదీకి కోర్టు బెయిల్ ఇస్తూ ఇలా వ్యాఖ్యానించింది. గర్భిణులు, పాలిచ్చే తల్లులకు కావాల్సింది బెయిల్, జైల్ కాదని ఈ కోర్టు న్యాయమూర్తి పేర్కొన్నారు. తల్లి చేసిన నేరం వల్ల పిల్లలను బాధపెట్టకూడదని, తల్లితో పాటు ఏమీ తెలియనిపసిపిల్లలను జైలులో ఉంచడం బావ్యం కాదని అన్నారు. అలాగే జైలులో పుట్టడం వల్ల ఆ పిల్లలపై ప్రతికూల ప్రభావం ఉంటుంది అని అన్నారు.. అందుకే డెలివరీ సమయం రెండు నెలల ముందుగానే వారికి ఏడాది వరకు బెయిల్ మంజూరు చేయడం న్యాయమని తన తీర్పులు ప్రస్తావించారు.

తెలంగాణలో రుణమాఫీపై

# 15 లేదా 18న కేబినెట్ భేటీ



హైదరాబాద్

తెలంగాణ: రైతులకు ఆగస్టు 15లోపు రూ. 2లక్షల రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇదే అంశంపై ఈ నెల 15 లేదా 18న మంత్రివర్గ భేటీ నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. రుణ మాఫీకి ఏ తేదీని కటాఫ్ తీసుకోవాలి? అర్హుల గుర్తింపునకు విధివిధానాల రూపకల్పన, నిధుల సమీకరణ మార్గాలపై చర్చించనున్నారు. ఇప్పటికే అధికారులు పలు రాష్ట్రాల్లో అధ్యయనం చేసినట్లు సమాచారం.

# గ్రూప్ 1 ప్రిలిమ్స్ కీ విడుదల



- ఈ నెల 17వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరణ
- త్వరలో ఫలితాల వెల్లడి
- మెయిన్ పరీక్షలకు టైం టేబుల్ రిలీజ్
- అక్టోబర్ 21 నుంచి 27 వరకు మెయిన్స్

తెలంగాణ-గ్రూప్1 ప్రిలిమ్స్ ప్రాథమిక 'కీ'ను టీపీఎస్సీ విడుదల చేసింది. ఈ మేరకు అధికారులు వెల్లడించారు. 'కీ'పై ఈనెల 17 వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నారు. ''ప్రాథమిక కీ, మాస్టర్ ప్రశ్నపత్రం అభ్యర్థుల వ్యక్తిగత లాగిన్‌లో ఈనెల 13 నుంచి 17 వరకు అందుబాటులో ఉంటాయి. అభ్యర్థులు ప్రాథమిక కీ కోసం తమ వివరాలను నమోదు చేయాలి. ప్రాథమిక కీ పైన అభ్యంతరాలను ఈనెల 17 సాయంత్రం 5 గంటల వరకు తెలియజేయాలి.

### అభ్యంతరాలు ఎలా పంపాలంటే....

మొదట కమిషన్ వెబ్‌సైట్‌లోని ప్రత్యేక లింక్ ద్వారా వ్యక్తిగత వివరాలను ధ్రువీకరించి, అభ్యంతరాలను ఆంగ్లంలో నమోదు చేయాలి. వాటికి తగిన రుజువులు, పుస్తక రచయిత పేరు, పుస్తకంలో పేజీ నంబరు... పత్రిక ఎడిషన్, పేజీ నంబరు, పబ్లిషర్ పేరు... వెబ్‌సైట్ యూఆర్ఎల్ వివరాలను ఇవ్వాలి. ఈమెయిల్, వ్యక్తిగత విజ్ఞాపనలు, ఇతర పద్ధతుల్లో వచ్చే, గడువు ముగిసిన తర్వాత వచ్చే అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోబోం'' అని కమిషన్ కార్యదర్శి నవీన్ నికోలస్ స్పష్టం చేశారు.

### అక్టోబర్ 21 నుంచి మెయిన్ పరీక్షలు

మరోవైపు రాష్ట్రంలో 563 గ్రూప్1 సర్వీసు పోస్టుల భర్తీకి ప్రధాన పరీక్ష షెడ్యూల్‌ను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించింది.
ఈ ఏడాది అక్టోబర్ 21 నుంచి 27 వరకు వరుసగా పరీక్షలు జరుగనున్నాయి.



- హంపి పీఠాధిపతి ఆశీస్సులు

# బాధ్యతలు తీసుకున్న బండి సంజయ్


- కేంద్ర హోం సహాయ మంత్రికి అభినందనలు
- నిరాడంబరంగా సాగిన కార్యక్రమం



కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బండి సంజయ్ బాధ్యతలను స్వీకరించారు. నిరాడంబరంగా సాగిన ఈ కార్యక్రమంలో విద్యారణ్య పీఠాధిపతుల ఆశీస్సులు అందుకున్నారు. గురువారం ఉదయం 11 గంటలకు ఢిల్లీలోని నార్త్ బ్లాక్‌లో బాధ్యతలను చేపట్టారు. కాగా, ఈ కార్యక్రమానికి జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు విద్యారణ్య భారతి స్వామీజీ హాజరయ్యారు. వేద మంత్రోచ్చరణలతో బండి సంజయ్‌కు ఆశీస్సులు అందించారు. సహచర మంత్రి నిత్యానంద రాయ్ పూలబొకే అందించి అభినందనలు తెలిపారు. భద్రతా కారణాల రీత్యా కార్యకర్తల అట్టహాసం, నాయకుల సందడి లేకుండా నిరాడంబరంగా ఆయన ఈ బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు తన అధికారిక నివాసంలో బీజేపీ నేతలు, కార్యకర్తలు బండి సంజయ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపేందుకు తరలివచ్చారు.

# "సిరిసిల్లా నేత కార్మికులకు ఉపాధి,ఆర్థిక భరోసా కల్పించండి"

- ప్రభుత్వ నిర్లక్ష్యానికి మరనేత కార్మిక కుటుంబాలు వీధిన పడుతున్నాయి..
- కేటీఆర్ మీద కక్ష్య సాధింపు చర్యలకు నేతన్నలు ఆకలి చావులకు గురౌతున్నారు
- సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ పద్మశాలీ -యువజన సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ మోహనకృష్ణ భార్గవ....బహిరంగ లేఖ



మన సాక్షి గొంతుక ప్రతినిధి/జనగామ :

జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ సామాజిక కవి,రచయిత తెలంగాణ పద్మశాలీ యువజన సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ మోహనకృష్ణ భార్గవ తెలంగాణ సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి కి సిరిసిల్ల మరనేత కార్మికుల కష్టాలను తెలుపుతూ వారి అభివృద్ధికి భరోసా కల్పించాలని లేఖ ద్వారా కోరారు.ఎన్నో వేల నేత కుటుంబాలకు ఉపాధి కల్పిస్తూ 'సిరుల'సిల్ల గా వెలుగొందిన సిరిసిల్ల నేడు వీధిన పడ్డ నేత కార్మికుల కుటుంబాలు,ఆకలి కేకలతో, ఆత్మహత్యలకు దారితీసి 'ఉరి'సిల్లగా మారుతుందన్నారు. పూర్వం బతుకమ్మ చీరలు,మైక్రో, తమిళనాడు చీరలు, స్కూల్ యూని ఫార్మ్ ఆర్డర్లతో ఇప్పటివరకు సుమారుగా మూడువేల కోట్ల విలువగల ఉత్పత్తులతో సిరిసిల్లా వెలుగొందినది.అంతే కాకుండా గత ప్రభుత్వం నిరుపేద కార్మికులను ఓనర్లుగా తీర్చిదిద్దే ప్రణాళికతో వర్క్ షెడ్స్ నిర్మాణం చేసి, వాటిలో కార్మికులకు ఉచితంగా పవర్లూమ్ అందించి లేబర్ నుండి ఓనర్ గా మార్చే ప్రయత్నం చేసింది.కాగా.. నేడు నూతన ప్రభుత్వం పూర్తి వ్యతిరేకత ప్రదర్శిస్తుందని వాపోయారు.ఇప్పటికే అందాల్సిన బతుకమ్మ చీరల ఆర్డర్ అందలేదు, మైక్రో మరియు యూనిఫార్మ్ ఆర్డర్లు కూడా రాలేదు.వీటిపై ఎటువంటి జీవో విడుదల కాలేదు,అందవలసిన ముందస్తు పెట్టుబడులు అందలేదు,అప్పుచేసి నేసిన బట్టలు ప్రభుత్వం కొనడం లేదు,బతుకమ్మ చీరలు ఉంటాయా ఉండవా....? అనే సూచన కూడా లేదు.గతంలో ఆగిపోయిన బకాయిలు చెల్లించడం లేదు,కార్మికులకు ఆర్థిక భరోసా గా నిలిచే త్రిఫ్ట్ ఫండ్ విడుదల చేయలేదు,పైగా యారన్ సబ్సిడి కింద చెల్లించాల్సిన 1.42 పైసలలో 80పైసలు కోత విధిస్తూ 62పైసలే కడతామని కార్మికుల జీవితాలను అగాథంలోకి తోస్తున్నారని అన్నారు. కేటీఆర్ సొంత నియోజకవర్గం కావడంతో సిరిసిల్ల ప్రజలపై ప్రభుత్వం కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతూ నేత కార్మికులను వీధి పాలు చేస్తుందన్నారు.ఉపాధి లేక అప్పులపాలైన కార్మికులు ఆసాముల కుటుంబాల ఆకల చావులకు దారి తీస్తుందని బాధ వ్యక్తం చేసారు.తక్షణమే.. ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలకు పరిష్కారం చూపించాలని బతుకమ్మ చీరలు,మైక్రో,స్కూల్ యూనిఫార్మ్స్ ఆర్డర్ విడుదల చేయాలి.. కోత లేకుండా పూర్తి యారన్ సబ్సిడి రిలీజ్ చేసి, పెట్టుబడి సహాయం,త్రిఫ్ట్ ఫండ్ విడుదల చేయాలి,పాతబకాయిలు మొత్తం వెంటనే చెల్లించాలి,నేసిన ప్రతీ బట్ట ప్రభుత్వమే కొనాలి.వస్త్ర తయారీ వార్షిక జీ.వో విడుదల చేయాలని.. వర్క్ షెడ్ లను తక్షణమే పూర్తిచేసి వర్కర్ ని ఓనర్ గా మార్చాలని,కార్మికుల భవిష్యత్ అభివృద్ధికై పూర్తి ఆర్థిక భరోసాతో కూడిన ప్రణాళిక రూపొందించాలని లేఖ ద్వారా కోరారు..



## ఆర్థిక సాయం అందించిన విహెచ్ఆర్ ఫౌండేషన్

మన సాక్షి గొంతుక ప్రతినిధి/ రామగుండం నియోజకవర్గం:

నియోజకవ్గంలోని 19 వ డివిజన్ పరిధిలోనీ న్యూ మారేడు పాక గ్రామం కు చెందిన పుట్టుకతోనే మూగ,అలాగే వినికిడి శక్తి లేని సతీష్ అనే ఒంటరి యువకునికి విహెచ్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 5 వేల రూపాయల ఆర్థిక సాయం తో పాటు నెలకు సరిపడ నిత్యావసర వస్తువులను అందజేశారు.ఈ సందర్భంగా స్థానిక గ్రామస్తులు మాట్లాడుతూ తల్లిదండ్రులు లేని ఒంటరిగా జీవిస్తున్న యువకుని పరిస్థితి వివరించి సాయాన్ని అడిగిన వెంటనే స్పందించి ఆర్థిక సాయం అందించిన ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు వ్యాల్ల హరీష్ రెడ్డి కి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రామగుండం నియోజకవర్గ VHR టీమ్ తో పాటు 19వ డివిజన్ ఫౌండేషన్ సభ్యులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

---

ఉమ్మడి వరంగల్,నల్గొండ,ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ గా గెలిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న(అలియాస్ చింతపండు నవీన్) గురువారం శాసన మండలిలో ప్రమాణ స్వీకారం చేసిన శుభ సందర్భంగా తీన్మార్ మల్లన్న టీం జిల్లా నాయకులు చిర్రా వీరస్వామి మల్లన్న ను కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో ఘనంగా




సన్మానించడం జరిగింది.

మన సాక్షి గొంతుక ప్రతినిధి/జనగామ:

## ప్రభుత్వ పాఠశాలలో 10 జిపిఎ సాధించిన గడ్డం నవ్య ను సన్మానించిన జనగామ అమ్మ ఫౌండేషన్

మన సాక్షి గొంతుక ప్రతినిధి/జనగామ:

జిల్లాకు చెందిన చిన్న పెండ్యాల ప్రభుత్వ హైస్కూల్లో చదువుతూ పదవ తరగతిలో 10/10 జిపిఎ సాధించి తెలంగాణ ప్రభుత్వ సిఎం రేవంత్ రెడ్డి అభినందించిన గడ్డం నవ్య ను జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్,ముఖ్య సలహాదారుడు వంగ భీమ్ రాజ్,మాస్టర్ కొయ్యడ రవి తదితరులు చిన్న పెండ్యాల కు వెళ్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గడ్డం నవ్య తో పాటు,ప్రధానోపాధ్యాయులు ని శాలువాతో సన్మానించారు.పాఠశాల ఉపాధ్యాయ సిబ్బందిని జనగామ అమ్మ ఫౌండేషన్ సభ్యులు అభినందించి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కూడా ఉన్నతంగా చదివి ఉన్నతంగా రాష్ట్రస్థాయిలో 10/10 రావడం చాలా సంతోషమని ప్రతి ఒక్కరు ఇదే స్ఫూర్తితో యువత పిల్లలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకోవాలని ప్రతి ఒక్కరు ప్రభుత్వ పాఠశాలను ప్రోత్సహించాలని దీనికి సహకారం చేస్తున్న ప్రభుత్వ టీచర్స్,హెడ్ మాస్టర్



కూడా బాల బాలికలను ప్రోత్సహిస్తూ భారతదేశం ఉన్నతంగా ఆర్థికంగా సూపర్ పవర్ భారతదేశం ఎదిగేందుకు ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఇదే పాఠశాలలో అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో బుక్స్ స్టేషనరీ వస్తువులు అందించడం జరిగిందని తెలిపారు.



## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

### -ఎంపీపీ పాండు గౌడ్

గజ్వేల్,మర్కుక్,జూన్13,మనసాక్షి గొంతుక

సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం పాములపర్తి గ్రామంలో తాడెం రాజయ్య అనారోగ్యంతో అకాల మరణం చెందారు.విషయం తెలుసుకున్న ఎంపీపీ పాండు గౌడ్ గురువారం మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి,ఆర్థిక సహాయం అందజేశారు.వారితో పాటు కుమ్మరి కరుణాకర్,తాడేం గణేష్,కిషోర్,బాబు,సాయి కుమార్ తదితరులు ఉన్నారు.



## విదేశీ విద్యకు సీబీఎస్ఈ దోహదం

### బిషప్ డాక్టర్ ఉడుముల బాల

మన సాక్షి గొంతుక ప్రతినిధి/జనగామ:

భవిష్యత్తులో విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు పాఠశాల స్థాయిలో సీబీఎస్?ఈ ఎంతో దోహదపడుతుందని బిషప్? డాక్టర్? ఉడుముల బాల,మునిసిపల్? చైర్?పర్సన్? పోకల జమున అన్నారు.గురువారం జనగామ జిల్లా కేంద్రంలోని సెయింట్? పాల్స్? హైస్కూల్?లో సీబీఎస్?ఈ నూతన బ్లాక్?ను వారు ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 25 ఏళ్లుగా నాణ్యమైన విద్యనందిస్తున్న సెయింట్? పాల్స్? యాజమాన్యం.. సామాన్యులకు సీబీఎస్?ఈ విద్యను అందుబాటులోకి తేవడం అభినందనీయమన్నారు.నాణ్యతా ప్రమాణాలతో మధ్యతరగతి వారికి అందుబాటులో ఈ విద్యను అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్? వైస్? చైర్మన్? మేకల రాంప్రసాద్,కౌన్సిలర్లు? బండ పద్మ,గంగరబోయిన మల్లేష్,సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి,పాఠశాల హెచ్?ఎం రెవరెండ్? ఫాదర్? ఎన్.మరియా జోసెఫ్,ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# ప్రైవేట్ ......
# ఈ దందా ఆగేదెన్నడు.....??

- ప్రైవేట్ స్కూళ్ళలో ఇష్టా రాజ్యంగా ఫీజులు
- చోద్యం చూస్తున్న విద్యా శాఖ అధికారులు
- పాఠశాలలో నే పుస్తకాలు కొనాలి అని యాజమాన్యాల ఒత్తిడి
- విద్యా హక్కు చట్టం 2009 ఏమాయే
- ఫీజులు పెరిగినా టీచర్ల జీతాలు అంతంత మాత్రమే
- తెలంగాణ టీచర్ ప్రైవేట్ ఫోరమ్ మండిపాటు





**మన సాక్షి గొంతుక ప్రతినిధి/ఉమ్మడి వరంగల్:** ప్రభుత్వ పాఠశాలలో కనీస వసతులు ఉండవని,ఉపాధ్యాయులు తక్కువ సంఖ్య లో ఉంటారని,తమ పిల్లవాడి పై ప్రత్యేక శ్రద్ద పెట్టరని అనే మానసిక ఆలోచనతో సామాన్య తల్లి దండ్రులు ఎంతో కష్టపడి,తమకంటే గొప్ప స్థాయి లో తమ పిల్లలుండాలి అనే ఉద్దేశ్యం తో ప్రయివేటు పాఠశాల కు పంపిస్తే,వారి రక్తాన్ని జలగ లాగ పీల్చి పిప్పి చేస్తున్నారు కార్పొరేట్ యాజమాన్యాలు.విద్య అందరికీ అవసరం అని,ఆ అవసరం కోసం తల్లిదండ్రులు ఏమైనా చేస్తారు అని ,ఒక అవకాశ వాదంతో , ప్రైవేట్ యాజమాన్యాలు విచ్చలవిడిగా దోపిడీ చేస్తున్నాయి.పుస్తకాలు,ఏకరూప దుస్తులు,బెల్టులు ఆఖరికి షూ కూడా మా పాఠశాలల్లో కొనాలని ఒత్తిడి చేస్తూ,సగటు మధ్య తరగతి కష్టాన్ని ఒక వైపు జలగ లా పీలుస్తున్న,విద్య శాఖ అధికారులు మాత్రం చోద్యం చూస్తూ,కేవలం ప్రెస్ నోట్ లకే ప్రాధాన్యం ఇస్తూ,చరవాణి లో సంప్రదిస్తే అందుబాటు లో లేకపోవడం,ఒక వేళ ఉన్నా యాజమాన్యాలకు వంత పాడుతున్నారు అంటేనే అర్థం చేసుకోవచ్చు,వారి మధ్యల ఉన్న సఖ్యత,అవినాభావ ఆర్థిక సంబంధం.విద్య హక్కు చట్టం 2009 ఏమైంది,ఫీజుల నియంత్రణ కోసం వేసిన చట్టాలు ఏవి,జీవో ఎం ఎస్ నంబర్ 1 1994 ప్రకారం వసూలు చేసిన ఫీజులో సగం టీచర్లకు జీతాల రూపం లో చెల్లించాలి.ఎన్ని ప్రభుత్వాలు మారిన టీచర్ల జీవితాలు,జీతాలు మారక పోగ,యాజమాన్యాల ఆర్థిక దోపిడీ ఎక్కువవుతుంది.ప్రైవేట్ యాజమాన్యాలకు అండగా అటు ప్రభుత్వం,ఇటు విద్యా శాఖ అధికారులు తోడు గా,అండగా ఉండటం తో వాళ్ల అరాచకాలకు అంతులేకుండా పోతుంది.ఆర్టీఏ అధికారులు సైతం ప్రతీ సంవత్సరం వెహికల్ యొక్క నాణ్యత,వాటి సామర్థ్యత,ఫస్ట్ ఎయిడ్ కిట్ ఉండాలి వాహనం లో,అనే కనీస జాగ్రత్త లు తీసుకోకుండా విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు.స్థానిక విద్యా శాఖ అధికారులకు తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరమ్ తరపున ఎన్ని సార్లు వినతి పత్రం ఇచ్చినా,నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరించే తీరు హాస్యాస్పదం.ఈ సంధర్భంగా తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరమ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు చంద్రగిరి సునిల్ కుమార్ మాట్లాడుతూ,వేసవి కాలంలో వేతనం ఇవ్వక,ఏప్రిల్ లో చివరి 7 రోజులు కూడా వేతనం చెల్లించకుండా, ఈపిఎఫ్,పీఎఫ్,కనీసం గుర్తింపు కార్డు ఇవ్వక, అనుమతి లేని,యాజమాన్యాలు ప్రైవేట్ టీచర్ యొక్క శ్రమ ను దోపిడీ చేస్తూ,జీవోలను తుంగ లో తొక్కుతూ,అటు రాజకీయ నాయకుల అండతో,ఇటు విద్యా శాఖ అధికారుల అండదండలతో ఇష్టా రీతిన వ్యవహరిస్తూ, విద్యార్థులను,వాళ్ళ తల్లిదండ్రుల ను సైతం ఇంతగా దగా,మోసం చేస్తుంటే,చాలా కలతగా ఉందన్నారు,ఇప్పటికైనా కొత్తగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం ఈ ఫీజుల నియంత్రణ చట్టం,టీచర్ల వెతలు,వేతనాల విషయాల్లో దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు.లేని పక్షాన తెలంగాణా ప్రైవేట్ టీచర్స్ ఫోరమ్ తరపున విద్యా శాఖ అధికారుల కార్యాలయాల ముట్టడి,సంబంధిత పాఠశాలల ముందు ధర్నా ,ఆందోళన కార్యక్రమాలు చేడతామని హెచ్చరించారు.



# ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలి

### అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పరిశీలన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**మన సాక్షి గొంతుక ప్రతినిధి/జనగామ:** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అధునాతన పద్ధతిలో విద్యా బోధన,మౌలిక సదుపాయాలు,ఉచిత సౌకర్యాలను అందిస్తున్నామని,వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.గురువారం నాడు జిల్లాలోని ఘనపూర్ (స్టేషన్) నియోజకవర్గంలోని రాఘవాపూర్ పరిధిలో గల ఎంపీయూపీఎస్ పాఠశాలను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సందర్శించి,అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా గుర్తించిన పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహిస్తున్న మౌలిక వసతుల పనులను పర్యవేక్షించి సిబ్బందికి తగు సూచనలు చేశారు.పెండింగ్ లో ఉన్న మిగిలిన మరమ్మతుల పనులు రెండు రోజుల్లోగా పూర్తిచేయాలని ఆదేశించారు.ప్రభుత్వ బడులను బలోపేతం చేసి,ఉన్నతమైన విద్యను అందిస్తున్నామని,విద్యార్థులు ప్రతి రోజు పాఠశాలకు రావాలని సూచించారు.అలాగే విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని,బడి బాట కార్యక్రమంలో భాగంగా బడి ఈడు పిల్లలను,బడి బయట చిన్నారులను బడిలో చేర్చాలని,వారి తల్లిదండ్రులకు ప్రభుత్వ బడుల్లో కల్పించేటటువంటి బోధన,తదితర విషయాల పట్ల అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.అదే విధంగా పాఠశాలలోని విద్యార్థులతో మాట్లాడారు.వారితో మీ అందరికీ పాఠ్య,నోటు పుస్తకాలు,యూనిఫాంలు అందాయా? మధ్యాహ్న భోజన పథకం కింద గుడ్లు,పాలు,భోజనం అందిస్తున్నారా? అని కలెక్టర్ అడుగగా, మాకు ఇక్కడ ఎటువంటి ఇబ్బంది లేదని,అన్ని పాఠ్య,నోటు పుస్తకాలు,యూనిఫాంలు అందాయని,పౌష్టికాహారం అందిస్తున్నారని విద్యార్థులు కలెక్టర్ కు వివరించారు.ఈ పరిశీలనలో ఆయన వెంట మండల నోడల్ అధికారి కొమురయ్య,సంబంధిత సిబ్బంది,ఉపాధ్యాయులు, విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

# రైతులు పంటల సాగులో మెలకువలు పాటించాలి

**మాడ్గుల, మన సాక్షి గొంతుక:** రైతులు పంటల సాగులో మెలకువలు పాటించి అధిక దిగుబడులు పొందాలని మాజీ వార్డ్ సభ్యుడు మార్పాకుల వెంకటనారాయణ గౌడ్ తెలిపారు. నకిలీ విత్తనాలు పొలాల్లో నాటి రైతులు మోసపోవొదని చెప్పారు. మాడ్గుల మండలం నల్లవారిపల్లి గ్రామంలో గురువారం రైతులు పత్తి విత్తనాలు నాటుతున్నారు. పంట పొలాలను సందర్శించి రైతులకు తగిన సూచనలు చేశారు. సేంద్రియ ఎరువులు వాడి పంట దిగుబడులను పెంచుకోవాలని సూచించారు.



# కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్ పార్టీ.

**మన సాక్షి గొంతుక జూన్ 13 (చెన్నూర్)** అధికారంలో ఉన్న,లేకున్నా, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు అండగా నిలుస్తుంది. పార్టీని నమ్ముకున్న కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నది.చెన్నూరు నియోజకవర్గం, క్యాతనపల్లి మున్సిపాలిటీ అమరవాది గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త నంది వెంకటస్వామి ఇటీవల పాముకాటుకు గురై స్వర్గస్తులవగా వారి కుటుంబ సభ్యులకు 2 లక్షల రూపాయల పార్టీ ఇన్సూరెన్స్ చెక్కును బిఆర్ఎస్ పార్టీ నాయకులు అందించడం జరిగినది.మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు &చెన్నూర్ మాజీ శాసనసభ్యులు బాల్క సుమన్ ప్రత్యేక చొరవ చూపి త్వరితగతిన రెండు లక్షల రూపాయల చెక్కును అందించేలా కృషి చేశారు.బాల్క సుమన్ ఆదేశాల మేరకు టౌన్ ప్రెసిడెంట్ కంభగోని సుదర్శన్ గౌడ్ మరియు స్థానిక 5వ వార్డు కౌన్సిలర్ జిలకర మహేష్ మృతుడి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులకు స్వయంగా చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కౌన్సిలర్ జాడి శ్రీనివాస్, స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి

మన సాక్షి గొంతుక ప్రతినిధి/జనగామ:

వర్షాకాలంలో వచ్చే అంటు వ్యాధులపై యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలని ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాలు చేపట్టి అవగాహన పరచాల్సిన అవసరం ఉందని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పింకేష్ కుమార్ తెలియజేశారు.గురువారం అదనపు కలెక్టర్ జెడ్పి సీఈవో అనిల్ కుమార్ లతో కలిసి గ్రామపంచాయతీ స్థాయిలో కార్యదర్శులకు ప్రత్యేక అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలని ప్రణాళిక బద్ధంగా కార్యక్రమాలు అంచలంచలుగా చేపట్టి ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు.ప్రధానంగా వర్షాకాలంలో త్రాగునీటి ద్వారా సంక్రమించే వ్యాధులైన మలేరియా,డెంగ్యూ,చికెన్ గున్యా పారిశుద్ధ్యం లోపం వలన కలుషిత నీరు తో వచ్చే అతిసారా,కలరా,టైఫాయిడ్, మెదడు వ్యాపు స్వైన్ ఫ్లూ మొదలగు వ్యాధులు కూడా ప్రబలే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని,చెత్త చెదారం లేకుండా చూసుకోవాలని త్రాగునీటి సరఫరా చేసే పైపులు లీకేజీలు కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.గ్రామపంచాయతీ సిబ్బందిచే రోడ్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయిస్తూ డంపింగ్ యార్డ్ కు తరలిస్తూ మురికి కాలువల యందు గుంతలలో క్రమం తప్పకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లించాలన్నారు.అంతేకాకుండా వర్షాకాలంలో త్రాగునీటిని వేడి చేసి చల్లార్చిన నీటిని త్రాగాలని ప్రజలందరికీ తెలిసేలా దండోరా వేయించాలన్నారు.పబ్లిక్ నల్లాల వద్ద చేతిపంపుల వద్ద అపరిశుభ్రతకు తావివ్వకుండా బట్టలు ఉతక రాదని పశువులను కడగరాదన్నారు.నివాస ప్రాంతాలలో ఖాళీ డబ్బాలు టైర్లు కొబ్బరి బోండాలు వంటివి లేకుండా చూసుకోవాలని ప్రతి వారంలో ఒకరోజు డ్రై డే గా పాటిస్తూ నీరు నిలవ ఉండకుండా చూసుకోవాలన్నారు.అధికారులు లోతట్టు ప్రాంతాలలో నీటి నిల్వలు లేకుండా చూడాలని గుంతలు పూడ్చాలని మూర్కి కాలవల్లో ఆయిల్ బాల్స్ వేయించాలని బ్లీచింగ్,ఫినాయిల్ వంటి చల్లించాలని తెలియజేశారు.ప్రతిరోజు గ్రామాలలో ఫాగింగ్ చేపట్టాలన్నారు.పరిసరాల పారిశుధ్యం పై ఉద్యమ రూపంలో విస్తృత ప్రచారం చేపట్టాలని ర్యాలీలు,సమావేశాలు నిర్వహించాలని,గ్రామస్థాయి వైద్య ఆరోగ్య సిబ్బందితో కలిసి ఇంటింటికి సమాచారాన్ని అందించాలన్నారు.ఆహార పదార్థాలపై మూతలు ఉంచాలని నిలువ చేసిన ఆహార పదార్థాలను వినియోగించరాదని ప్రజలకు తెలియచెప్పాలన్నారు.మల విసర్జనకు మరుగుదొడ్లనే వినియోగించాలని,ఈగలు,దోమలు పెరగకుండా లార్వా స్థాయిలోనే నిరోధించేందుకు కృషి చేయాలన్నారు.వ్యక్తిగత శుభ్రత అత్యంత అవసరమని వ్యాధి లక్షణాలు కనిపిస్తే తక్షణం వైద్యాధికారులను సంప్రదించాలన్నారు.ఉరుములు మెరుపుల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, నీటికి దూరంగా ఉండటం ఎత్తైన భవనాలకు,చెట్లకు దూరంగా ఉండాలని తెలియజేశారు.సాధ్యమైనంత వరకు విద్యుత్ పరికరాలలో విద్యుత్తు సరఫరాను నిలుపుదల చేయాలన్నారు.





## ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సన్మానించిన నాగపురి కిరణ్

మన సాక్షి గొంతుక ప్రతినిధి/ జనగామ

ఉమ్మడి వరంగల్, ఖమ్మం మరియు నల్గొండ పట్టభద్రుల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా గెలిచిన తీన్మార్ మల్లన్న ప్రమాణస్వీకారం కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తో కలిసి , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాగపురి కిరణ్ కుమార్ పాల్గొనడం జరిగింది. ఈ సందర్భముగా ఎమ్మెల్సీగా ఎన్నికైన తీన్మార్ మల్లన్నకు అభినందనలు తెలిపి, పుష్పగుచ్చం అందించి, శాలువలతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ తీన్మార్ మల్లన్న ఎమ్మెల్సీగా గెలవడం సంతోషకరమైన విషయమని, ఈరోజు వారి ప్రమాణస్వీకారంలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేయడం జరిగిందని అన్నారు.

## ఇరిగేషన్ సెక్టార్ ను నాశనం చేసిన కేసీఆర్

# ఆగస్టు 15 నాటికి లక్షా ఇరవై వేల ఎకరాలకు గోదావరి నీళ్లు

- సీతారామ పేరిట రీ డిజైన్ తో ప్రజాధనం దుర్వినియోగం
- ఎనిమిది వేల కోట్లు ఖర్చుపెట్టి ఒక ఎకరానికి నీరు ఇవ్వని గత బిఆర్ఎస్ ప్రభుత్వం
- ఎన్కూర్ లింకు కెనాన్ కు రాజీవ్ కెనాల్ గా నామకరణం
- మంత్రులతో కలిసి సీతారామ ప్రాజెక్టుపై సమీక్షించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ఇరిగేషన్ సెక్టార్ ను నాశనం చేసిన మాజీ సీఎం కేసీఆర్: మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి

**6 గంటల పాటు సీతారామ ప్రాజెక్టు పనుల పరిశీలన**

- కెనాల్ వెంట 63 కిలోమీటర్లు ప్రయాణం చేసిన డిప్యూటీ సీఎం, మంత్రులు




ఆగస్టు 15 నాటికి ఎన్కూరు లింకు కెనాల్ ను పూర్తి చేసి లక్షా ఇరవై వేల ఎకరాలకు ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వం గోదావరి నీళ్లను అందిస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. గురువారం సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో కలిసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం అమ్మగారి పల్లి వద్ద ఉన్న సీతారామ హెడ్ రెగ్యులేటరీ పనులను, అక్కడ ఉన్న వ్యూ పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ను తిలకించారు. అక్కడి నుంచి సీతారామా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పంప్ హౌజ్- 1 వద్దకు చేరుకొని పంప్ హౌజ్ పనులను పరిశీలించిన అనంతరం పవర్ సప్లై ను ప్రారంభించారు. ఆ తర్వాత పంపు హౌజ్ -3 వద్దకు చేరుకొని ప్రాజెక్టు పురోగతిపై అధికారులతో సమీక్షించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఇప్పటివరకు జరిగిన ప్రాజెక్టు పనులు, కొనసాగుతున్న కెనాల్స్ పనులు, భూ సేకరణ, ప్రాజెక్టు పూర్తి కావడానికి కావలసిన నిధులు, ఎదురవుతున్న సమస్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులు మంత్రులకు వివరించారు. అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ కేవలం రూ. 2654 కోట్లతో పూర్తయ్యే రాజీవ్, ఇందిరా సాగర్ ప్రాజెక్టులను సీతారామ ప్రాజెక్టుగా రీ డిజైన్ చేసి 20 వేల కోట్ల రూపాయలకు పెంచి గత ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని విమర్శించారు. దశాబ్ద పాలనలో సీతారామ ప్రాజెక్టుపై ఎనిమిది వేల కోట్ల రూపాయలను ఖర్చు పెట్టిన గత ప్రభుత్వం ఒక్క ఎకరానికి కూడా తాగునీరు ఇవ్వలేదన్నారు. ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వ అధికారంలోకి రాగానే రాష్ట్రంలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్షలు చేశామన్నారు. సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయడానికి సమీక్షంచమన్నారు. సీతారామ ప్రాజెక్టు కు ఎన్ఎస్పిఎల్ కెనాల్ కు లింకు చేయడానికి 9 కిలోమీటర్లు ఉన్న ఎన్కూర్ లింక్ కెనాల్ ను పూర్తి చేయడానికి 72 కోట్లు రూపాయలు మంజూరి చేశామన్నారు. ఎన్నికల కోడ్ ముందు ఈ పనులను సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి వైరాకు వచ్చి శంకుస్థాపన చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అదేవిధంగా పంప్స్ ట్రయల్ రన్ చేయడానికి కావలసిన పవర్ సప్లై కోసం నిధులు ఇచ్చామన్నారు. పంప్స్ ట్రయల్ రన్ ప్రాసెసింగ్ కొనసాగుతుందని చెప్పారు. ఎన్కూర్ లింకు కెనాల్ ను రాజీవ్ కెనాల్ గా నామకరణం చేస్తున్నట్టు వెల్లడించారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ పంప్ హౌజ్ 1, 2, 3 డిస్ట్రిబ్యూటరీ ప్యాకేజీ పనులు తొందరలోనే మొదలు పెడతామని వెల్లడించారు

# సబ్ స్టేషన్ లో పిడుగుపాటు...



మన సాక్షి గొంతుక/ న్యూస్ పాపన్నపేట

పాపన్నపేట మండల పరిధిలోని రామతీర్థం సబ్స్టేషన్లో గురువారం సాయంత్రం పిడుగు పడింది. దీంతో పవర్ ట్రాన్స్ఫార్మర్ పగులు వచ్చి కొంతమేర ఆయిల్ నష్టం జరిగింది దీంతో సబ్స్టేషన్ పరిధిలోని మల్లంపేట రామతీర్థం ముద్దాపురం నర్సింగ్ రావు పల్లి తదితర గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా సంబంధిత అధికారులు ప్రత్యామ్నాయ చర్యలను చేపట్టారు. సంబంధిత ఇంజనీర్లు వస్తే తప్ప ఎంత నష్టం జరిగిందో చెప్పలేమని సబ్ స్టేషన్ వర్గాలు వెల్లడించాయి.

## కాంగ్రెస్ సర్కార్ హామీ నిలబెట్టుకోవాలి..

- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
-'మనఊరు-మనబడి'ని కొనసాగించాలి
-సర్కారు బడులను బలోపేతం చేయాలి
-స్కూళ్లకు ఉచితంగా కరెంట్ ఇవ్వాలి

సిద్దిపేట

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం తక్షణమే 25 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో విద్యార్థులకు బుక్స్, యూనిఫారాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 25 వేలకుపైగా పాఠశాలలు పునః



ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ సర్కారు డీఎస్సీలో 25 వేల ఖాళీలు నింపుతామని చెప్పి కేవలం 11 వేల ఖాళీలకే నోటిఫికేషన్ ఇచ్చిందని మండిపడ్డారు.



# ఆ విఘ్నం దాటేశారు

## బ్యాడ్మింటన్‌లో మనోళ్లు అదుర్స్

- మిక్స్‌డ్ డబుల్స్‌లో మలేషియాపై దూకుడు
- సుమిత్, సిక్కిరెడ్డి మెరుపు వేగం
- ఆస్ట్రేలియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ
- రెండో రౌండ్‌కి దూసుకెళ్లిన భారత క్రీడాకారులు

ఆస్ట్రేలియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్లు శుభారంభం చేశారు. పురుషుల, మహిళల సింగిల్స్ విభాగాల్లో పలువురు తొలి రౌండ్ విఘ్నాన్ని విజయవంతంగా దాటారు. బుధవారం జరిగిన మిక్స్‌డ్ డబుల్స్‌లో సుమిత్-సిక్కిరెడ్డి ద్వయం 21-17, 21-19తో లిమ్-వొంగ్ (మలేషియా) ను ఓడించి రెండో రౌండ్‌కు దూసుకెళ్లారు. పురుషుల తొలి రౌండ్‌లో హెచ్ఎస్ ప్రణయ్ 21-10, 23-21 తో కొలెహో డి ఒలివిర (బ్రెజిల్)ను ఓడించగా కిరణ్ జార్జి 21-17, 21-10తో జియడొంగ్ (కెనడా)ను చిత్తు చేసి రెండో రౌండ్‌కు చేరారు.


### ఆస్ట్రేలియాను మట్టికరిపించిన సమీర్..

సమీర్ వర్మ 2110, 2110తో (ఆస్ట్రేలియా)ను మట్టికరిపించాడు. మంజునాథ్, రవి, సుబ్రహ్మణ్యన్, అభిషేక్ ఓటమిపాలయ్యారు. మహిళల సింగిల్స్‌లో మాళవిక బన్సోద్ 2110, 218తో భారత్‌కే చెందిన మొపటిని ఓడించగా ఆకర్షి కశ్యప్ 2114, 2111తో పొలిన బురొవ (ఉక్రెయిన్)ను చిత్తుచేసింది. అనుపమ ఉపాధ్యాయ 2114, 2321తో వాంగ్ లియాంగ్ (మలేషియా)ను ఓడించింది.

## ఐర్లాండ్ చేతిలో పాక్ భవిష్యత్

- ఆ జట్టు అమెరికాతో గెలవాల్సిందే
- అప్పుడే పాకిస్థాన్‌కు సూపర్ 8లోకి చాన్స్

అమెరికా, పాక్ జట్ల భవితవ్యం ఐర్లాండ్ చేతిలో ఉంది. గ్రూప్ ఎలో ఐదు జట్లు తలపడుతున్నాయి. తొలి రెండు స్థానాల్లో నిలిచిన టీమ్‌లు 'సూపర్ -8'కి చేరతాయి. ఇప్పటికే టీమిండియా సూపర్ 8లోకి వెళ్లింది. ఇక ఈ గ్రూప్ నుంచి ఒక్క జట్టుకే చాన్స్ ఉంది. యూఎస్ఏ, భారత్ చేతిలో ఓటమిపాలైన పాక్.. కెనడాపై గెలిచింది. దీంతో పాయింట్ల ఖాతాను తెరిచింది. తన చివరి మ్యాచ్‌లో అద్భుత విజయం సాధించి నెట్‌రన్‌రేట్‌ను మెరుగుపర్చుకుంటే.. పాక్‌కు సూపర్ 8 చాన్స్ ఉంటుంది. యూఎస్ఏ చివరి మ్యాచ్‌లో ఓడిపోవాలి. ఐర్లాండ్‌తోనే పాక్ (జూన్ 16న) చివరి మ్యాచ్ ఆడి గెలవాలి.. అప్పుడే పాక్ భవితవ్యంపై ఓ స్పష్టత రానుంది.



# నాదల్-అల్కారజ్ ఒక్కటయ్యారు

## పారిస్ ఒలింపిక్స్‌కి రెడీ

- కలిసి ఆడనున్న జోడీ
- సంతోషంలో అభిమానులు

ప్రపంచ టెన్నిస్ అభిమానులకు స్పెయిన్ దిగ్గజం రఫెల్ నాదల్, యువ సంచలనం కార్లొస్ అల్కారజ్ గుడ్ న్యూస్ చెప్పారు. రాబోయే పారిస్ ఒలింపిక్స్‌లో ఈ ఇద్దరూ డబుల్స్ విభాగంలో జోడీ కట్టనున్నారని స్పెయిన్ టెన్నిస్ సమాఖ్య వెల్లడించింది. నాదల్‌ను ఆరాధించే అల్కారజ్.. ఇటీవలే ఫ్రెంచ్ ఓపెన్ నెగ్గిన విషయం విదితమే. ఒక్కొక్కరుగా ఆడితేనే ప్రత్యర్థులను చుక్కలు చూపించే ఈ ఇద్దరూ.. కలిసి ఆడనుండటంతో అది అభిమానులకు కన్నుల పండుగే కానుంది.

# సూపర్ -8 రేసు.. బంగ్లా పోటీలోనే..

**అర్ధ సెంచరీతో ఆదుకున్న షకిబ్**

**ఛేదనలో విఫలమైన నెదర్లాండ్స్**

టీ20 ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్ సమిష్టి ప్రదర్శనతో సత్తాచాటింది. గెలిస్తే గానీ ముందంజ వేయలేని పరిస్థితుల్లో కీలకమైన నెదర్లాండ్స్‌తో మ్యాచ్‌లో జూలు విదిల్చింది. తొలుత షకిబ్ అల్‌హసన్ అర్ధసెంచరీతో అదరగొట్టడంతో బంగ్లాకు పోరాడే స్కోరు దక్కింది. లక్ష్యఛేదనలో బంగ్లా బౌలర్ల ధాటికి నెదర్లాండ్స్ కుదేలైంది. వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయిన డచ్ టీమ్ చేజేతులా ఓటమి కొనితెచ్చుకుంది.



**కింగ్స్‌టౌన్ (సెయింట్ విన్సెంట్):** సూపర్-8 దశకు చేరాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో బంగ్లాదేశ్ సమిష్టి ప్రదర్శనతో రాణించింది. గురువారం కింగ్స్‌టౌన్ వేదికగా నెదర్లాండ్స్‌పై ఆ జట్టు 25 పరుగుల తేడాతో గెలిచింది. సీనియర్ ఆల్‌రౌండర్ షకిబ్ అల్ హసన్ (46 బంతుల్లో 64 నాటౌట్, 9 ఫోర్లు) కీలక ఇన్నింగ్స్ ఆడటంతో మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లా నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. స్వల్ప లక్ష్య ఛేదనలో నెదర్లాండ్స్ బ్యాటర్లు క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయి ఓటమి వైపున నిలిచారు. 20 ఓవర్లలో ఆ జట్టు 134/8 కే పరిమితమైంది. సిబ్రండ్ ఎంగెల్‌బ్రెచ్ట్ (22 బంతుల్లో 33, 3 ఫోర్లు, 1 సిక్సర్) టాప్ స్కోరర్. షకిబ్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.

ఆదుకున్న షకిబ్:
బంగ్లాదేశ్ ఇన్నింగ్స్ ఒడిదొడుకుల మధ్యే సాగింది. రెండో ఓవర్లోనే ఓపెనర్ శాంటో (1) వికెట్ కోల్పోయిన ఆ జట్టు.. 4వ ఓవర్లో ప్రమాదకర లిటన్ దాస్ (1) ఔట్ కావడంతో కష్టాల్లో చిక్కుకుంది. కానీ తాంజీద్ హసన్ (35)తో కలిసి సీనియర్ ఆల్‌రౌండర్ షకిబ్ బంగ్లాను ఆదుకున్నాడు. ఈ ఇద్దరూ మూడో వికెట్‌కు 48 రన్స్ జోడించారు. తాంజీద్ స్థానంలో వచ్చిన తౌవిద్ హృదయ్ (9) విఫలమయ్యాడు. 38 బంతుల్లో అర్ధ సెంచరీతో పూర్తిచేసిన షకిబ్.. ఆఖర్లో మహ్మదుల్లా (25), జేకర్ అలీ (14 నాటౌట్) అండతో బంగ్లాకు పోరాడగలిగే స్కోరును అందించాడు.

తడబడ్డ నెదర్లాండ్స్:
భారీ ఛేదనేమీ కాకపోయినా నెదర్లాండ్స్ ఇన్నింగ్స్ సైతం నెమ్మదిగానే సాగింది. 2 ఫోర్లు, ఓ సిక్సర్ సాయంతో 18 పరుగులు చేసిన లెవిట్‌ను 5వ ఓవర్లో టస్కిన్ అహ్మద్ పెవిలియన్‌కు పంపాడు. 3 ఫోర్లు కొట్టి జోరుమీదున్న మ్యాక్స్ ఓడౌడ్ (12).. తాంజిమ్ షకిబ్ 6వ ఓవర్లో అతడికే రిటర్న్ క్యాచ్ ఇచ్చాడు. ధాటిగా ఆడిన విక్రమ్‌జిత్ (26) కూడా మహ్మదుల్లా 9వ ఓవర్లో ముందుకొచ్చి ఆడబోయి స్టంపౌట్ అయ్యాడు. రిషద్ హొసెన్ 15వ ఓవర్లో.. క్రీజులో కుదురుకున్న సిబ్రండ్‌తో పాటు బస్ డి లిడెను ఔట్ చేసి డచ్ జట్టుకు డబుల్ షాకులిచ్చాడు. ఆఖరి 4 ఓవర్లలో నెదర్లాండ్స్ విజయానికి 44 పరుగులు అవసరం కాగా.. ఆ జట్టు లోయర్ ఆర్డర్ కూడా చేతులెత్తేయడంతో గెలిచే మ్యాచ్‌ను చేజార్చుకుంది.

సంక్షిప్త స్కోర్లు:
బంగ్లాదేశ్: 20 ఓవర్లలో 159/5 (షకిబ్ 64 నాటౌట్, తాంజీద్ 35, మికెరెన్ 2/15, ఆర్యన్ 2/17).
నెదర్లాండ్స్: 20 ఓవర్లలో 134/8 (సిబ్రండ్ 33, విక్రమ్‌జిత్ 33, రిషద్ 3/33, టస్కిన్ 2/30)


# నసావు ఖేల్ ఖతం

**స్టేడియం కూల్చివేతకు రంగం సిద్ధం**

**న్యూయార్క్:** బ్యాటర్లకు అనుకూలంగా ఉండే పొట్టి ఫార్మాట్‌లో చాలాకాలం తర్వాత బౌలర్లు ఆధిపత్యం చెలాయించేలా అవకాశం కల్పించిన క్రికెట్ స్టేడియం ఇక చరిత్రలో భాగం కానుంది. టీ20 వరల్డ్‌కప్ కోసం సుమారు రూ. 250 కోట్లతో తాత్కాలికంగా న్యూయార్క్‌లోని ఈస్ట్ మిడో ఏరియాలో 930 ఎకరాల్లో ఉన్న ఐసెన్‌హోవర్ పార్క్‌లో 106 రోజులలోనే నిర్మించిన నసావు క్రికెట్ స్టేడియం కూల్చివేతకు రంగం సిద్ధమైంది. పొట్టి ప్రపంచకప్‌లో 8 మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చిన నసావు.. బౌలర్లకు స్వర్గధామంగా నిలిచింది. అడిలైడ్ నుంచి ప్రత్యేకంగా తెప్పించిన 10 డ్రాప్ ఇన్ పిచ్‌లతో ఇక్కడ బ్యాటర్లు పరుగుల కోసం తంటాలుపడ్డారు. జూన్ 12న అమెరికాతో భారత్ మ్యాచ్ ముగిసిన తర్వాత నిర్వాహకులు స్టేడియంలో స్టాండ్స్‌ను కూల్చివేసి ఇక్కడి సామాగ్రిని తరలించే పని మొదలుపెట్టారు.

గురువారం స్టేడియం సమీపంలో భారీ బుల్డోజర్లు, క్రేన్లు దర్శనమిచ్చిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. లాస్ వెగాస్ నుంచి అరువు తీసుకొచ్చిన సామాగ్రి (కుర్చీలు, స్టాండ్స్, విడి భాగాలు) అక్కడ నిర్వహించే గోల్ఫ్ ఈవెంట్‌కు తిరిగి ఇవ్వనున్నట్టు న్యూయార్క్ టైమ్స్ ఓ కథనంలో పేర్కొంది.

34 వేల సామర్థ్యంతో నిర్మించిన ఈ స్టేడియంలో ప్రతిష్టాత్మక భారత్-పాక్ మ్యాచ్‌తో పాటు మిగిలిన మ్యాచ్‌లన్నీ అభిమానులను అలరించాయి. ఇప్పటి దాకా భారత్ ఆడిన మ్యాచ్‌లు అన్నీ ఇక్కడే జరిగాయి. వంద పరుగులు ఛేదించడానికి జట్లు నానా తంటాలు పడిన ఈ పిచ్‌పై కెనడా సాధించిన 137 పరుగులే అత్యధిక స్కోరు కావడం గమనార్హం. నసావు స్టేడియాన్ని కూల్చివేస్తుండటంపై సోషల్ మీడియాలో నెటిజన్లు స్పందిస్తూ.. 'బౌలర్ల అడ్డాగా నువ్వెప్పటికీ గుర్తుంటావు' అంటూ కామెంట్స్ చేస్తున్నారు.





# సూపర్ 8లోకి ఆస్ట్రేలియా

- అలవోకగా దూసుకెళ్లింది..
- నమీబియాపై ఘన విజయం



టీ20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా సూపర్ 8లోకి దూసుకెళ్లింది. నమీబియాతో పోరులో ఆసీస్ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. నమీబియా నిర్దేశించిన 73 పరుగుల లక్ష్యాన్ని 5.4 ఓవర్లలో వికెట్ నష్టానికి 74 పరుగులు చేసింది. ట్రావిస్ హెడ్(34 నాటౌట్), వార్నర్(20) రాణించారు. తొలుత ఆడమ్ జంపా(4/12) ధాటికి నమీబియా 17 ఓవర్లలో 72 పరుగులకు కుప్పకూలింది. మరోవైపు శ్రీలంక, నేపాల్ మధ్య వర్షం కారణంగా బంతి పడకుండానే రద్దయ్యింది. దీంతో గ్రూపుడీ నుంచి దక్షిణాఫ్రికా అధికారికంగా సూపర్ 8లోకి ప్రవేశించింది.


# విండీస్ కూడా..

## త్రిశంకు స్వర్గంలో కివీస్

- విండీస్ చేతిలో న్యూజిల్యాండ్ ఓటమి
- గ్రూప్స్‌లో ఆఖరి స్థానంలో కేన్ మామ సేన



ప్రతీ ప్రపంచకప్‌లో చివరి వరకు పోరాడి, సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌ల్లో ఓటమి పాలై, తిరిగి వెళ్లే న్యూజిలాండ్ ఈసారి సంప్రదాయానికి విరుద్ధంగా ఆడింది. గ్రూప్ దశలోనే రెండు మ్యాచ్ ల్లో ఓటమి పాలై అట్టడుగు స్థానంలో పడి, ఇంటి దారి పట్టనుంది. వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో చివరి వరకు పోరాడిన న్యూజిలాండ్ ఓటమిపాలైంది. గ్రూప్ ఏ లో పాకిస్తాన్ పరిస్థితి ఇంచుమించు అలాగే ఉంది. టాస్ గెలిచిన న్యూజిలాండ్ మొదట బౌలింగు తీసుకుంది. దీంతో బ్యాటింగ్ కి వచ్చిన వెస్టిండీస్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 149 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో కివీస్ 20 ఓవర్లలో 136 పరుగులకి ఆలౌట్ అయింది. 13 రన్స్ తేడాతో ఓటమిపాలైంది.



# RUHANI SHARMA

## పరికిణీలో పరువాలు

చిలసౌ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ రుహానీ శర్మ. మొదటి సినిమాతో పద్దతైన తెలుగు అమ్మాయి అన్నట్లుగా కనిపించిన ఈ అమ్మడు ఆ తర్వాత తర్వాత జోరు పెంచింది, అందాల ఆరబోత ఫోటోలు షూట్స్ షేర్ చేయడంతో పాటు, గ్లామర్ పాత్రల్లో నటించి మెప్పించింది. సోషల్ మీడియాలో రెగ్యులర్ గా ఈ అమ్మడు ఫోటో షూట్స్ తో అందరి దృష్టిని ఆకర్షిస్తూ తన ఫాలోవర్స్ కి మరియు నెటిజన్స్ కి వినోదాల విందు అందిస్తూ ఉంటుంది. తాజాగా మరోసారి కంట్రీ స్టైల్ ఫోటో షూట్ తో చూపు తిప్పకోకుండా చేసింది. ఈ స్థాయి అందంను మేము ఊహించలేదు అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. ! తాజా ఫోటో షూట్ లో లంగా ఓణీ లో రుహానీ శర్మ తన నడుము అందాలను చూపిస్తూ నాభి అందాలతో కవ్విస్తుంది. ఈ స్థాయి అందంగా ఉన్నా కూడా పాపం రుహానీకి ఎందుకు ఆఫర్లు ఎక్కువ రావడం లేదు అంటూ కొందరు నెటిజన్స్ సోషల్ మీడియా ద్వారా ఈ అమ్మడి అందం గురించి ప్రశంసలు కురిపిస్తున్నారు. పక్కా పల్లెటూరు అమ్మాయిగా లంగా ఓణీ లో అందాలను చూపిస్తూ, అదే పల్లెటూరు తరహా హెయిర్ స్టైల్ తో రుహానీ భలే ఉందే అన్నట్లుగా నెటిజన్స్ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ స్థాయి అందాల విందు చేస్తే ముందు ముందు అయినా టాలీవుడ్ లో ఈ అమ్మడికి వరుస ఆఫర్లు వస్తాయనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.



### పృథ్వీకి నాన్ బెయిలబుల్

## అరెస్ట్ వారెంట్

ప్రముఖ సినీ నటుడు, 30 ఇయర్స్ ఇండస్ట్రీగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నాడు పృథ్వీ. పలు సినిమాల్లో తన కామెడీతో ప్రేక్షకుల్ని ఎంతగానో అలరించిన నటుడు పృథ్వీకి తాజాగా షాక్ తగిలింది. విజయవాడ ఫ్యామిలీ కోర్టు పృథ్వీకి నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. నటుడు పృథ్వీ రాజ్ భార్య శ్రీ లక్ష్మి తనకు మనోవర్తి చెల్లించాలని గతంలో కోర్టును ఆశ్రయించింది. దీంతో నటుడు పృథ్వీ తన భార్యకు మనోవర్తి చెల్లించాలని కోర్టు తెలిపింది. కానీ కోర్టు ఆదేశాలను పాటించకపోవడంతో పాటు నటుడు పృథ్వీరాజ్ కోర్టుకు కూడా హాజరు కాకపోవడంతో తాజాగా కోర్టు నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీ చేసినట్లు తెలుస్తోంది. అసలేమైంది అనే విషయానికొస్తే.. నటుడు పృథ్వీరాజ్ 1984లో శ్రీలక్ష్మిని మ్యారేజ్ చేసుకున్నాడు. వీరికి ఒక కొడుకు, కూతురు ఉన్నారు. అయితే కొంతకాలం బాగానే ఉన్నారు. కానీ ఒకానొక సమయంలో అనివార్య కారణాల వల్ల ఈ దంపతుల మధ్య విభేదాలు తలెత్తాయి. ఇక అప్పటి నుంచి వీరిద్దరు విడిగానే ఉంటున్నారు. దీంతో శ్రీలక్ష్మి తన పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లిపోయింది. అనంతరం 2017లో కోర్టును ఆశ్రయించింది. అదే క్రమంలో తన భర్త పృథ్వీ రాజ్ నుంచి తనకు నెలకు రూ.8లక్షలు భరణం ఇప్పించాలని కోర్టును కోరింది. ఎందుకంటే పృథ్వీరాజ్ సినిమాలు చేస్తున్న సమయంలో అతడికి అయ్యే ఖర్చులన్నీ తన కుటుంబమే చూసుకుందని తెలిపింది. కానీ అతడు సినిమాల్లోకి వెళ్లాక తనను వేధిస్తూ ఉండేవాడని పేర్కొంది. అదే సమయంలో 2016లో తనను బయటకు పంపించడంతో పుట్టింటికి వచ్చేసినట్లు అప్పట్లో ఫిర్యాదు చేసింది. ఇక ఆ సమయంలోనే తన భర్త సినిమాలు, సీరియల్స్ చేస్తూ నెలకు రూ.30 లక్షలు సంపాదిస్తుండటంతో తనకు భరణం ఇప్పించాలని కేసు దాఖలు చేసింది. దీనిపై కోర్టు 2022లో తీర్పు వెలువరించింది. అప్పటి వరకు శ్రీలక్ష్మికి అయిన కోర్టు ఖర్చులతో పాటు నెలకు రూ.8లక్షలు పదోతేదీ లోపల చెల్లించాలని కోర్టు ఆదేశించింది. అయితే నటుడు పృథ్వీరాజ్ కోర్టు ఆదేశాలను పాటించకపోవడమే కాక.. కోర్టుకు కూడా హాజరుకాకపోవడంతో అతడి మీద నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీ చేసినట్లు సమాచారం.

## పికాక్ కవర్‌పై మృణాల్




టాలీవుడ్ సీతగా పాపులర్ అయ్యింది బాలీవుడ్ బ్యూటీ మృణాల్ ఠాకూర్. తెలుగులో ఫస్ట్ మూవీ సీతారామం తో మంచి క్రేజ్ సంపాదించుకుంది. తన అందం, అభినయంతో సీతామహాలక్ష్మి రోల్ లో అలరించి ఫ్యాన్ బేస్ క్రియేట్ చేసింది. ఆ తర్వాత ఒక్కసారిగా టాలీవుడ్ మేకర్స్ దృష్టిలో పడింది. వరుస సినిమా ఆఫర్లు వస్తున్నా.. ఆచితూచి సెలెక్ట్ చేసుకుంది. మరోవైపు, బాలీవుడ్ లో కూడా మంచి ఆఫర్లు అందుకుంటోంది. మూవీ రిజల్ట్ తో ఎలాంటి సంబంధం లేకుండా వరుస సినిమాల్లో నటిస్తోంది. ఇక సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్ గా ఉండే మృణాల్.. తన అందచందాలతో అలరిస్తుంటోంది. రకరకాల ఔట్ ఫిట్స్ లో సందడి చేస్తుంటోంది. అందాలు ఆరబోసి కుర్రాళ్ల హృదయాలను గెలుచుకుంటూ ఉంటోంది. లేటెస్ట్ గా ఇంగ్లీష్ మ్యాగ్ జైన్ ది పికాక్ కవర్ పేజీపై ప్రత్యక్షమైంది. ఇంటర్వ్యూలో తన గోల్స్, కెరీర్ తదితర విషయాలను మృణాల్ పంచుకుందని మ్యాగ్ జైన్ నిర్వాహకులు తెలిపారు. ఆమె గురించి రాసుకొచ్చిన లాంగ్ నోట్ ఆకట్టుకుంటోంది. అయితే మ్యాగ్ జైన్ కవర్ పేజ్ పై గ్రే కలర్ డ్రెస్ లో తళుక్కుమంది మృణాల్. అమాయకపు చూపుతో ఫిదా చేస్తోంది. ఎద అందాలతో సెగలు పుట్టిస్తోంది. అదిరిపోయే నెక్ సెట్.. ఆమె అందాన్ని మరింత పెంచింది. ప్రస్తుతం మృణాల్ పిక్ సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతోంది. అమ్మడు సూపర్ అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

## ఖర్బందా.. హాట్ లుక్స్

సినిమా రంగంలో స్టార్ హీరోయిన్ అవ్వడం ప్రతి ఒక్కరి కోరిక. కానీ ఆ కోరిక అందరికీ నెరవేరదు. అలాంటి అదృష్టం దొరకని బ్యూటీలలో కృతి ఖర్బందా ఒకరు. ఈ పేరు గుర్తున్నా లేకపోయినా, ఒకప్పుడు టాలీవుడ్‌లో హీరోయిన్‌గా చాలా సినిమాలు చేసిన సంగతి కొంతమందికి తెలుసు. కానీ, ఈ సినిమాలు తగినంత హిట్ సాధించలేకపోవడంతో, కృతి టాలీవుడ్‌కు దూరమైంది. అయితే, కృతి సోషల్ మీడియా ద్వారా అభిమానులకు అందుబాటులో ఉండి, ఎప్పటికప్పుడు కొత్త ఫోటోలు, వీడియోలతో ఆకట్టుకుంటూ ఉంటుంది. ఇటీవల ఆమె షేర్ చేసిన కొన్ని గ్లామరస్ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. బికినీ ధరించి, కెమెరా ట్రిక్ ఉపయోగించి, కొన్ని హాట్ ఫోటోలతో స్టన్ అయ్యేలా చేసింసి. గ్లామరస్ గా కనిపించే ఈ ఫోటోలు బాగా ట్రెండ్ అయ్యాయి. ఇక రీసెంట్ గా అమ్మడు మరోసారి స్టన్ అయ్యేలా దర్శనమిచ్చింది. తెల్లని చొక్కాలో ఎద అందాలు హైలెట్ అయ్యేలా కనిపించింది. ఇక తన హావభావాలతో అమ్మడు గ్లామర్ వేడితో మంటలు రేపింది. కృతి ఎలా ఉన్నా అందంగా ఉంటుంది అని ప్రతీ ఒక్కరు కామెంట్ చేస్తున్నారు.



## ఆధ్యాత్మిక బాటలో సమంత



సమంత కొంత కాలంగా ఆధ్యాత్మిక చింతనలోనూ తరుచూ కనిపిస్తుంది. నాగచైతన్యతో విడాకుల తర్వాత ఆమెలో ఎన్నో రకాల మార్పులొచ్చాయి. ఆధ్యాత్మికంగా గడపడానికి ఎక్కువగా ఆసక్తి చూపిస్తుంది. విడాకుల తర్వాత భారత్ లోనే ప్రఖ్యాత దేవాలయాలన్నింటిని సందర్శించింది. కషాయం ధరించి వివిధ ఆధ్యాత్మిక చింతన కార్యక్రమాల్లో పాల్గొంది. సద్గురు ఇషా ఫౌండేషన్ లో సైతం సమంత కనిపించింది. సద్గురు శాంతి వ్యాఖ్యల్ని..జీవితం పట్ల ఆయన చేసిన వ్యాఖ్యల్ని ప్రశాంతమైన మనసు..హృదయంతో విని వాటిని ఆచరణలో పెట్టే ప్రయత్నం చేస్తుంది. ఈ నేపథ్యంలో సమంత మరోసారి సద్గురు సేవలో పునీతురాలైంది. సేవలో పాల్గొన్న కొన్ని ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. నలుపు వస్త్రాలు.. మెడలో పూల మాలలు ధరించి సద్గురు చెబుతోన్న నీతి బోధనల్ని ఎంతో శ్రద్ధగా వినడం ఇక్కడ చూడొచ్చు. రెండు చేతులు జోడించి సద్గురుకి నమస్కరించిన విధానం ఆమెలో ఎంతో భక్తిశ్రద్ధల్ని తెలియజేస్తుంది. వందలాది మంది ఆ ఆధ్యాత్మిక చింతన కార్యక్రమంలో పాల్గొన్నారు.